క్లుప్తంగా

ఆర్థిక సాయం
ఆత్మకూరు: పట్టణంలోని బలిజవీధికి చెందిన పసుపులేటి పెద పెంచలయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను నలిశెట్టి శ్రీధర్, జేపీ ప్రసాద్ మంగళవారం పరామర్శించారు. రూ.7వేలు సాయం అందజేశారు.

ఆర్టీసీ లక్కీడ్రా
ఉదయగిరి: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం లక్కీ డ్రా తీశారు. సీతారామపురం మార్గంలో ప్రయాణికుల ఆదరణ పొందేందుకు నిర్వహించిన ఈ లక్కీడ్రాలో మహేంద్ర, నిఖిత విజేతలుగా నిలవగా డీఎం శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

సమయాన్ని పాటించాలి
దుత్తలూరు: అంగన్‌వాడీలు సమయాన్ని పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు షేక్ షాను అన్నారు. దుత్తలూరులోని పూసలకాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అంగన్‌వాడీ కార్యకర్త నూర్జహాన్‌కు సూచనలు చేశారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు.
సంగం: స్థానిక రాళ్లచెలిక, మిక్సెడ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తనిఖీ చేశారు.పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించారు. ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువులను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి పోషకాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీలు వెంకటరమణమ్మ, కొండమ్మ, సహాయకులు బషీరా, పద్మ పాల్గొన్నారు.

అభినందనలు
సోమశిల: అనంతసాగరం మండల ఎంఈఓ-1గా విధులు నిర్వహిస్తున్న జానకిరాం కందుకూరు ఇన్‌చార్జి డిప్యూటీ ఈఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి మెట్టుకూరు సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యాల డానియేల్, అనంతసాగరం మండల అధ్యక్షురాలు శ్రీలత, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు వద్దిబోయిన వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు మంగళవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

రీసర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు
దుత్తలూరు: భూముల రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఇంకా ఏమైనా చిన్నచిన్న పొరపాట్లు ఉంటే వాటి పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. మండలంలోని కొత్తపేటలో రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. వెంగనపాలెం సర్పంచ్ తిప్పిరిబోయిన వెంగయ్య, ఎంపీటీసీ దయానందం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి
వరికుంటపాడు: ఆశ, ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని వైద్యాధికారిణి కరీష్మా, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశాడేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి దోమలతో వ్యాప్తి చెందే విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, టీబీ సూపర్‌వైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన మరమ్మతులకు ప్రతిపాదనలు
ఉదయగిరి: ఎంపీడీఓ కార్యాలయ భవనం మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ డీఈ మణికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన భవనాన్ని పరిశీలించి సిబ్బందితో కొలతలు తీయించారు. భవనానికి సంబంధించిన కలప, తదితర సామగ్రిని రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో భవనానికి మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతున్నామని తెలిపారు. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు షరీఫ్, వెంకటేష్, నరసింహ, శేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గోడ తొలగించాలని వినతి
అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట దర్గాలో ఈశాన్యంలో చిన్న దర్గాలకు వెళ్లే దారిలో అడ్డుగా కట్టిన గోడను తొలగించి భక్తుల రాకపోకలకు వీలు కల్పించాలని మండల ఆవాజ్ కమిటీ నాయకులు కోరీరు. ఈ మేరకు స్థానికులతో కలిసి దర్గా ఈఓ మహమ్మద్ హుస్సేన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 300 ఏళ్ల చరిత్ర కలిగిన దారిని గత దర్గా పాలకులు దురుద్దేశపూర్వకంగా మూసివేశారని తెలిపారు. గోడ కట్టి చిన్న దర్గాలకు వెళ్లే భక్తులను ఇబ్బందులకు గురిచేశారని విన్నవించారు. ముస్లిం శ్మశానవాటికకు వెళ్లేందుకు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. భక్తులు, స్థానికుల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని గోడను తొలగించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి సయ్యద్ అస్లాం, ఆవాజ్ కమిటీ నాయకులు ఎం నిసార్‌అహ్మద్, షేక్ గయాజ్, స్థానికులు సత్తార్, జమీర్, షకీల్ అహ్మద్, ఖలీల్, నయీమ్, జావిద్ పాల్గొన్నారు.

అపార్‌కు ఆధార్ గ్రహణం

- అక్షరం తప్పు ఉన్నా నమోదుకు ఆటంకం
- వివరాలు సరిచేస్తేనే ప్రక్రియ వేగవంతం

కావలిలోని బాలికోన్నత పాఠశాలలో 266 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఆధార్‌లో పేర్లు, ఇతర వివరాలు తప్పుల తడకగా ఉండడంతో 106 మందికి అపార్ నమోదు చేయలేని పరిస్థితి నెలకొంది. విద్యార్థినులు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా చిరునామా మార్పు తప్ప, ఇతర తప్పులను సరిదిద్దడానికి అవకాశం లేదని చెబుతున్నారు. పుట్టిన తేదీ మార్పు పెద్ద సమస్యగా మారడంతో తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య జిల్లా వ్యాప్తంగా ఉంది.


పాఠశాల విద్యార్థినులు

కావలి: దేశ వ్యాప్తంగా విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదుకు ఆధార్ వివరాలు ఆటంకంగా మారుతున్నాయి. ఆధార్ కార్డులో ఉన్న సమాచారం మేరకే అపార్ జారీ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు సంబంధించిన వివరాలు ఆధార్‌లో తప్పుల తడకగా ఉండడంతో ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. ముందుగా ఆధార్‌లో వివరాలు సరిచేసి తరువాత అపార్ నమోదు చేపట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఒక్కో పాఠశాలలో 40 శాతం నమోదు కూడా పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది.
నూతన విద్యా విధానం అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఒన్ నేషన్ ఒన్ స్టూడెంట్ ఐడీ పేరిట ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు అపార్ జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థికి సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం నమోదై ఉంటుంది. దేశంలో ఎక్కడైనా చదవాలన్నా, ఉపాధి అవకాశాలు పొందాలన్నా ఈ శాశ్వత డిజిటల్ గుర్తింపు సంఖ్య కీలకం కానుంది. ముఖ్యంగా ధ్రువపత్రాల రక్షణకు అవకాశం ఉంటుంది. అయితే విద్యార్థుల ఆధార్ వివరాల్లోని తప్పులతో అపార్ నమోదుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆధార్‌లో ఒక విధంగా, పాఠశాలలో మరోలా పేర్లు ఉండడంతో వాటిని మార్చడం సమస్యగా మారింది. చాలా మందికి ఆధార్ జారీ సమయంలో పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదు చేశారు. నెల, తేదీ సరిగా నమోదు చేయకపోవడంతో ఇబ్బందులు నెలకొన్నాయి. పాఠశాల, ఆధార్‌లోని వివరాలు సరిపోలినప్పుడే అపార్ నమోదవుతుంది. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, మొబైల్ నంబరు, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ సంఖ్యలో ఏదైనా తప్పుగా చూపినా నమోదు కావడం లేదు. పేరులో అక్షరాలు సైతం ఒకేలా ఉంటేనే ఆన్‌లైన్‌లో ముందుకెళ్లడానికి అవకాశం ఉంటుంది. పాఠశాల రికార్డుల్లో నమోదైన సమాచారానికి ఆధార్ వివరాలకు పొంతన లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పుట్టిన తేదీ, పేర్లు, సెల్‌ఫోన్ నంబర్ పరంగా ఎక్కువగా తప్పులు దొర్లుతున్నాయి. చిరునామా సైతం ఆధార్‌కు, పాఠశాలలోని రికార్డుల్లోని చిరునామాలో తేడా ఉండటంతో ఈ ప్రక్రియ సజావుగా సాగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ వివరాలు సరి చేయడానికి తల్లిదండ్రులకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆధార్‌లో పుట్టిన తేదీ సమస్య పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శి ఇచ్చే ధ్రువీకరణ పత్రం ఉంటేనే మార్పునకు అవకాశం ఉంటుంది. గ్రామాల్లో 80 శాతం జనన వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో నమోదు చేయడం లేదు. రెవెన్యూ శాఖ జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తేనే ఆధార్‌లో మార్పునకు అవకాశం ఉంటుంది. నవంబరు 30లోగా అపార్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం అపార్ కార్డు విద్యార్థులకు తప్పనిసరి కావడంతో ఆధార్‌లోని తప్పులను సరిచేయించుకునేందుకు తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని మండలాల్లో ఆధార్ కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో సుదూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆధార్ సమస్యతో అపార్ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు	3,418
మొత్తం విద్యార్థుల సంఖ్య	3,30,065
అపార్ పొందిన విద్యార్థుల సంఖ్య	1,50,000
జూనియర్ కళాశాలలు	187
మొత్తం విద్యార్థుల సంఖ్య	53 వేలు
అపార్ పొందిన విద్యార్థుల సంఖ్య	21 వేలు

వేగవంతంగా అపార్ నమోదు
జిల్లాలో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. 1 నుంచి 12వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేపడుతున్నాం. జిల్లాలోని విద్యార్థులకు అపార్ గుర్తింపు సంఖ్యలిచ్చే ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తాం. అపార్ నమోదుకు విద్యార్థులు కొంత అసౌకర్యానికి గురైనప్పటికీ భవిష్యత్తులో ఇది అన్ని రకాలుగా ఉపయోగపడుతుంది.
– ఆర్ బాలాజీరావు, డీఈఓ, నెల్లూరు.

తలసేమియా డే కేర్ సెంటర్ వరం

కావలి: కావలి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ఆవరణలో త్వరలో ప్రారంభించనున్న తలసేమియా డే కేర్ సెంటర్ కావలి ప్రాంత తలసేమియా బాధిత చిన్నారులకు వరమని కావలి ఆర్డీఓ, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఎం వంశీకృష్ణ పేర్కొన్నారు. తలసేమియా డే కేర్ సెంటర్ నిర్వహణకు పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంక్ అధికారి, రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కన్వీనర్ కే హరినారపరెడ్డి రూ.1,09,000, ప్రముఖ బిల్డర్ దేవరపల్లి మధుసూదన్‌రెడ్డి రూ.1,00,016 నగదు విరాళాన్ని ప్రకటించారు. దాతల నుంచి నగదు చెక్కులను ఆర్డీఓ వంశీకృష్ణ మంగళవారం స్వీకరించారు. అనంతరం దాతలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మరో పది రోజుల్లో తలసేమియా డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. తలసేమియా బాధిత చిన్నారుల కోసం దాతల సాయంతో కావలి వంటి చిన్నపట్టణంలో డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. డే కేర్ సెంటర్ నిర్వహణకు దాతలు ముందుకొచ్చి రెడ్‌క్రాస్‌కు సహకరించాలని కోరారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ఆధునీకరణ, తలసేమియా డే కేర్ సెంటర్ నిర్మాణానికి విశేష కృషి చేసి విరాళాలు సేకరించిన రెడ్‌క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డిని ఆర్డీఓ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకును పరిశీలించారు. బ్లడ్‌బ్యాంకు కన్వీనర్ బెజవాడ రవికుమార్ బ్లడ్‌బ్యాంకు సేవలను ఆర్డీఓకు వివరించారు. అనంతరం ఆర్డీఓను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, రొటేరియన్ వెంకట సుబ్బయ్య, రక్త కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


దాతలను సత్కరిస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

మద్యం దుకాణాలను తొలగించాలని వినతి

సోమశిల: జనావాసాల నడుమ మద్యం దుకాణాలను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని అనంతసాగరానికి చెందిన మహిళలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు జనావాసాల నడుమ మద్యం దుకాణాలను ఏర్పాటు చేయకూడదని తెలిపారు. అయితే ఇప్పటికే ఒక దుకాణాన్ని జనావాసాల నడుమ ఏర్పాటు చేసి ఉండగా, మరో దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి మద్యం షాపులను ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, ఖాజా, ఖాజామస్తాన్, ఇబ్రహీం, స్థానిక మహిళలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రత్యామ్నాయ పంటలతో లాభాలు


అనుమసముద్రంపేట: రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ దేవసేనమ్మ


సీతారామపురం: పసుపు పంటను పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి

ఆత్మకూరురూరల్: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయడం ద్వారా లాభాలను పొందవచ్చని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ తెలిపారు. కరటంపాడు, బోయలచిరివెళ్ల రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం శనగ, కంది, తదితర పంటలను ప్రోత్సహిస్తుందన్నారు. పొగాకును అధికంగా సాగుచేసి నష్టపోకుండా శనగ, కంది పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఏఓ కిషోర్‌బాబు, వీఏఏలు యస్దాని, శ్రావణి పాల్గొన్నారు.
మర్రిపాడు: మండలంలోని పడమటినాయుడుపల్లి, చుంచులూరు గ్రామాల్లో ఏఓ ఎస్ రామ్మోహన్ పర్యటించారు. పడమటినాయుడుపల్లిలో మినుము పంటను పరిశీలించి లద్దె పురుగు ఉన్నట్లు గుర్తించి నివారణకు యమామెక్టిన్ బెంజోయేట్‌ను లీటర్ నీటికి 0.4 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. చుంచులూరులో పొట్టదశలో ఉన్న వరి పంటను పరిశీలించారు.
సీతారామపురం: మండలంలోని చింతోడు, పెదనాగంపల్లి గ్రామాల్లో ఏఓ చెన్నారెడ్డి పర్యటించారు. చింతోడులో పసుపు పంటను పరిశీలించి దుంపకుళ్లు తెగులులో మొక్కలు ఎండిపోతున్నట్లు గుర్తించి నివారణకు లీటరు నీటికి మూడు గ్రాముల కాపర్‌ఆక్సైడ్‌ను కలిపి మొక్క మొదళ్లలో పోయాలని సూచించారు. పెదనాగంపల్లిలో వరి పంటను పరిశీలించి సూచనలు చేశారు.
వరికుంటపాడు: వరికుంటపాడు, రామాపురం రైతుసేవా కేంద్రాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ రవికుమార్ పాల్గొన్నారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.
అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన, శ్రీకొలను రైతుసేవా కేంద్రాల్లో ఏఓ టీ రజని ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ హాజరై పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా శనగ, కంది, మినుము, తదితర పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు/సంగం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి పెంచలయ్య వైద్యసిబ్బందికి సూచించారు. ఆత్మకూరులోని అర్బన్ హెల్త్ సెంటర్, సంగం పీహెచ్‌సీలను మంగళవారం ఆయన సందర్శించి వైద్యసిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఫీవర్ సర్వేలు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విషజ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేసి తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. డాక్టర్లు అస్మా, శ్రీనివాసులరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పశుగణన సర్వే పరిశీలన

వరికుంటపాడు: మండలంలోని పీఆర్‌పల్లె, విరువూరు, టీసీపల్లె, యర్రంరెడ్డిపల్లె, తదితర గ్రామాల్లో చేపడుతున్న పశుగణన సర్వేను పెద్దిరెడ్డిపల్లి పశువైద్యశాల వైద్యాధికారి రాఘవేంద్ర శర్మ మంగళవారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి పశువుల సమగ్ర వివరాలను సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించా. సర్వే నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే తనను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కావలి: అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని లోక్‌అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి కోరారు. పట్టణంలోని జనతాపేటలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ పురోభివృద్ధికి అవినీతి ప్రధాన అవరోధమన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి పౌర సంస్థలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం అవినీతి రహిత దేశానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. బ్యాంక్ క్రెడిట్ ఆఫీసర్ ప్రేమ వర్మ, అడ్మిన్‌ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

రేపు ఉదయగిరి జిల్లా సాధనకు ర్యాలీ

ఉదయగిరి: ఉదయగిరి జిల్లా సాధనకు పట్టణంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఉదయగిరి జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో చేపట్టే ర్యాలీలో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజాసంఘాల నాయకులు, యువత, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

టెట్‌లో మెరిసిన మెట్టప్రాంత ఆణిముత్యం

సీతారామపురం: టెట్ ఫలితాల్లో సీతారామపురానికి చెందిన షేక్ నాయబ్‌రసూల్ ప్రతిభ చాటాడు. 150 మార్కులకు గానూ 148.39 మార్కులు సాధించాడు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు. టీచర్ పోస్టు సాధించడమే తన లక్ష్యమని నాయబ్‌రసూల్ తెలిపారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



కావలి: పట్టణంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా ఖలీం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే స్టేషన్‌లో ఇద్దరు ఎస్సైలు ఉన్నారు. మూడో ఎస్సైగా కలీం విధుల్లో చేరారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల ప్రజలు నాగుల చవితి పర్వదినాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు ఉపవాస దీక్షలు ఆచరించి సమీపంలోని పుట్టల వద్ద, ఆలయాల్లోని నాగశిలల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చలిపిండి, సజ్జలను నైవేద్యంగా సమర్పించారు. నోములు నోచుకుని ఉపవాసదీక్షలు ఆచరించారు.


ఉదయగిరిలో నాగులపుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కావలి/అల్లూరు: పట్టణంలోని కోర్టువీధి, ముసునూరులోని సాయిక్షేత్రంలోని పుట్టల వద్దకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. పట్టణంలోని దుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అల్లూరుతో పాటు గ్రామాల్లోని పుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. నాగేంద్రుడికి పాలు పోసి చలిపిండి , సజ్జలను నైవేద్యంగా సమర్పించారు.
ఆత్మకూరు/ ఆత్మకూరురూరల్/సోమశిల/ సంగం/అనుమసముద్రంపేట: ఆత్మకూరులోని నాగేంద్రపురం శివారుప్రాంతం, ప్రియదర్శినినగర్, మోడల్ ఎస్టీకాలనీ, పశువుల ఆస్పత్రి సమీపంలోని పుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. శివాలయంలోని నాగశిలల వద్ద దారాలు చుట్టి పసుపు, కుంకుమ చల్లి పూజలు చేశారు. సజ్జలు, చలిపిండి ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. ఆత్మకూరు మండలంలోని మహిమలూరు, చెర్లోయడవల్లి, బట్టేపాడు, వాశిలి, రామస్వామిపల్లి, దేపూరు, వెన్నవాడ, తదితర గ్రామాల్లోని నాగుల పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. అలాగే అనంతసాగరం, అనుమసముద్రం మండల ప్రజలు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సంగం మండలం కోలగట్లలోని నాగార్పమ్మ ఆలయం, సంగంలోని సంగమేశ్వరాలయంలో ఉన్న నాగశిలల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.
ఉదయగిరి/ కలిగిరి/కొండాపురం/ సీతారామపురం/ వరికుంటపాడు: ఉదయగిరిలోని సంతానలక్ష్మి, నగిరితోటతో పాటు వెంకట్రావుపల్లి, అప్పసముద్రం, కుర్రపల్లి బీసీ కాలనీ, గడ్డంవారిపల్లి, మిట్టపల్లి, శకునాలపల్లి, బోడబండ, కృష్ణంపల్లి, గండిపాళెం, గుడినరవ, బిజ్జంపల్లి, మసీదుపల్లి, తదితర గ్రామాల్లోని పుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నప్రసాద వితరణ చేశారు. కలిగిరిలోని శివాలయం, సిద్దనకొండూరులోని సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండాపురం, సీతారామపురం, వరికుంటపాడు మండలాల ప్రజలు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.


సంగంలో..


అనంతసాగరం మండలంలో..


కావలి: కోర్టు వీధిలోని పుట్ట వద్ద భక్త జన కోలాహలం


కావలి: ముసునూరులోని సాయి క్షేత్రంలో..


కలిగిరి శివాలయంలో..


ఆత్మకూరులో..

దోమల నివారణకు ఫాగింగ్
కావలి: పట్టణంలో దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మద్దూరుపాడు పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు మున్సిపల్ సిబ్బంది మంగళవారం ఫాగింగ్ చేపట్టారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ ఫాగింగ్ చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు.

బెల్టుషాపుపై దాడి
దుత్తలూరు: మండలంలోని నందిపాడు సెంటర్‌లో నిర్వహిస్తున్న బెల్టు షాపుపై ఉదయగిరి ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. బత్తుల వేణు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై దీప్తి కరంత్ తెలిపారు.

చెరువు చేపల వేలం
సోమశిల: అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్ల చెరువు చేపల వేలం ప్రక్రియను సర్పంచ్ లక్ష్మమ్మ, ఈఓపీఆర్డీ తిరుపతయ్య అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి రమణరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వేలం పాటకు నలుగురు రూ.10వేలు డిపాజిట్ కట్టి హాజరుకాగా, ఖాదర్‌సాహెబ్ అనే వ్యక్తి రూ.4.15 లక్షలకు దక్కించుకున్నారు. ఉపసర్పంచ్ రాధా, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ
సీతారామపురం: స్థానిక బిట్-1 సచివాలయంలో సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి ఆధ్వర్యంలో ఉపాధి పనులపై గ్రామసభను మంగళవారం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ మురళీకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.